సాక్షి తిరుపతి
మంగళవారం । 7 । జనవరి । 2025



సర్వేజనా సుఖినోభవంతు

కూటమి ప్రభుత్వం మళ్లీ రీ సర్వేకి శ్రీకారం చుట్టింది. ఈనెల 20వ తేదీ నుంచి జిల్లా వ్యాప్తంగా రీసర్వే చేయనుంది. - 8లో



విస్తృతంగా పింఛన్ల తనిఖీ

జిల్లాలో పింఛన్ల తనిఖీ ప్రారంభమైంది. రూ.15వేలు తీసుకుంటున్న వారి అర్హత వివరాలు తెలుసుకుంటున్నారు. - 8లో



భక్తుల ఆరోగ్య భద్రతే లక్ష్యం

తిరుమలకు వచ్చే భక్తుల ఆరోగ్య భద్రతే లక్ష్యంగా ఆహారం అందించాలని టీటీడీ అదనపు ఈఓ ఓటళ్ల యజమానులను ఆదేశించారు. - 8లో

న్యూస్‌రీల్

స్టెమ్ ల్యాబ్ ఏర్పాటు



పల్లం హైస్కూల్‌లో స్టెమ్ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న కేవీ రమణ

రేణిగుంట(ఏర్పేడు): బ్రాడ్ కామ్ ఆర్థిక సహాయంతో బెంగళూరుకు చెందిన క్రైసంస్థ, ప్రగతి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పేడు మండలం, పల్లం జెడ్పీ ఉన్నత పాఠశాల, శ్రీకాళహస్తి మండలం , ముచ్చివోలు జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో సోమవారం స్టెమ్ ల్యాబ్‌లను ఏర్పాటు చేశారు. పిల్లల్లో సైన్స్ అండ్ టెక్నాలజీ, గణిత అంశాలపై ఆసక్తి పెంచడమే లక్ష్యంగా వీటిని ఏర్పాటు చేసినట్టు ప్రగతి సంస్థ డైరెక్టర్ కేవీ రమణ తెలిపారు. ఈ పాఠశాలల్లో రూ.7 లక్షల విలువైన స్టెమ్ ల్యాబ్‌లను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో పల్లం హెచ్‌ఎం తీగల ఆనంద్, ప్రగతి సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

20 నుంచి సర్వే



పోస్టర్ ఆవిష్కరణలో కలెక్టర్‌తోపాటు జేసీ, డీఆర్వోలు, డీఎంహెచ్‌ఓలు

తిరుపతి అర్బన్: కలెక్టరేట్‌లో సోమవారం కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్‌తోపాటు, జేసీ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు, డీఎంహెచ్‌వో బాలకృష్ణ నాయక్‌తోపాటు పలువురు వైద్యుల చేతుల మీదుగా కుష్ఠు వ్యాధి సర్వేకు చెందిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. జాతీయ కుష్ఠు నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ఈ నెల 20 నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు ఇంటింటా సర్వే చేయాల్సి ఉంది. ఈ సందర్భంగా రోగులకు వ్యాధి నివారణపై అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు.

మధ్యవర్తిత్వంపై అవగాహన



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జడ్జి గురునాథ్

తిరుపతి లీగల్: రాష్ట్ర న్యాయ సేవ సంస్థ, ఉమ్మడి చిత్తూరు జిల్లా న్యాయ సేవా సంస్థ, తిరుపతి మండల న్యాయ సేవ అధికార సంస్థలు సంయుక్తంగా సోమవారం తిరుపతి శ్వేత భవనంలో రాయలసీమ జిల్లాలకు చెందిన 25 మంది న్యాయమూర్తులకు అధ్యవర్తిత్వంపై అవగాహన తరగతులును ప్రారంభించాయి. ఈ తరగతులను తిరుపతి మూడవ అదనపు జిల్లా జడ్జి, మండల న్యాయ సేవ అధికార సంస్థ చైర్మన్ ఎం.గురునాథ్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ తరగతులు సుప్రీంకోర్టు మధ్యవర్తిత్వ ప్రాజెక్టు కమిటీ ఆధ్వర్యంలో చేపట్టారు. ఢిల్లీకి చెందిన సీనియర్ ట్రైనీలు సుధీర్ కుమార్ జైన్, నగీన జైన్ అవగాహన కల్పించనున్నారు. ఈ అవగాహన తరగతులు సోమవారం నుంచి ఈనెల 10వ తేదీ వరకు జరగనున్నాయి. అవగాహన తరగతుల్లో ఉమ్మడి చిత్తూరు, అనంతపురం, వైఎస్సార్ కడప, కర్నూలు జిల్లాలకు చెందిన 25 మంది న్యాయమూర్తులు పాల్గొన్నారు.

హౌసింగ్ ఈఈ బాధ్యతల స్వీకరణ



కలెక్టర్‌తో హౌసింగ్ ఈఈ దయాకర్

తిరుపతి అర్బన్: నెల్లూరు జిల్లా హౌసింగ్ ఈఈ దయాకర్‌ను తిరుపతి జిల్లా ఈఈగా బదిలీ చేశారు. ఆ మేరకు ఆయన బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. తిరుపతి జిల్లా గృహనిర్మాణశాఖ అధికారి వెంకటేశ్వర్లు రెండు నెలల క్రితం బదిలీపై విజయవాడకు వెళ్లారు. ఈ క్రమంలో తిరుపతి డీఈగా పనిచేస్తున్న శ్రీనివాసులకు జిల్లా బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు రెగ్యులర్ అధికారిగా దయాకర్‌ను ఈఈగా జిల్లాకు పంపారు. హౌసింగ్ విభాగానికి చెందిన పలువురు ఆయనకు అభినందనలు తెలిపారు.


మహిళా ఓటర్లే అధికం

తిరుపతి అర్బన్: 2025 షెడ్యూల్ ప్రకారం ఓటర్ల జాబితాను సోమవారం కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ విడుదల చేశారు. తిరుపతి జిల్లా ఓటర్లు 18,04,229 మందిగా ఉండగా.. అందులో స్త్రీలు 9,25,735 మంది, పురుషులు 8,78,321, ఇతరులు 173 మంది ఉన్నట్టు తెలిపారు. అలాగే ఎన్ఆర్ఐ ఓటర్లు 295 మంది, సర్వీస్ ఓటర్లు 823 మంది ఉన్నట్టు పేర్కొన్నారు. జిల్లాలో అత్యధికంగా చంద్రగిరి అసెంబ్లీ పరిధిలో 3,14,230 మంది కాగా, తిరుపతి పరిధిలో 2,96,531 మంది ఓటర్లు ఉన్నారు.



కరోనా వైరస్ ముందు ప్రపంచమే తలవంచ్చింది. వైరస్ వచ్చిన మొదట్లో జనజీవనాన్ని స్తంభింపజేసింది. బంధాలు, బంధుత్వాలను సైతం విచ్ఛిన్నం చేసింది. ఈ మహమ్మారి పేరు వింటేనే ఇప్పటికీ ఒళ్లు జలదరిస్తుంది. ఆ పీడ కల పూర్తిగా మరువకముందే మరోసారి హెచ్‌ఎంపీవీ వైరస్ రూపంలో ప్రజల్ని భయభ్రాంతులకు గురిచేస్తోంది. ఇప్పటికే దేశంలోకి ప్రవేశించిన ఈ వైరస్ మెల్లమెల్లగా పాకే అవకాశం ఉందని వైద్యయంత్రాంగం హెచ్చరిస్తోంది. భయమొద్దు.. భద్రతే ముద్దని సూచిస్తోంది.





భయమొద్దు HMPV శుభ్రతే ముద్దు

హెచ్‌ఎంపీవీ వైరస్ కలకలం

- బెంగళూరులో ప్రత్యక్షం
- కొందరికి నిర్ధారణ అయినట్లు ప్రకటించిన ఐసీఎంఆర్
- ఈ వైరస్ కూడా కోవిడ్ తరహా లక్షణాలే
- అప్రమత్తత అవసరమంటున్న వైద్య నిపుణులు
- భయాందోళనకు గురవుతున్న జిల్లా ప్రజలు



తిరుపతి తుడా: హ్యూమన్ మెటాఫ్ న్యూమోవైరస్ (హెచ్‌ఎంపీవీ) వైరస్ ప్రపంచాన్ని వణికించేలా కనిపిస్తోంది. ప్రస్తుతం చైనాను అతలాకుతలం చేస్తున్న ఈ వైరస్ ఇప్పుడు భారత్‌లోకి ప్రవేశించింది. మొదటి కేసు కర్ణాటక రాష్ట్రంలోని బెంగళూరులో నమోదవడం కలకలం రేపుతోంది. తిరుపతి, చిత్తూరు, అనంతపురం, సత్యసాయి జిల్లాలకు అత్యంత సమీపాన బెంగళూరు నగరం ఉండడంతో పాటు నిత్యం వందలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. హెచ్‌ఎంపీవీ కేసు నిర్ధారణ అయినట్లు ఐసీఎంఆర్ ప్రకటించడం ఇప్పుడు చర్చనీయాంశమైంది.

స్థానికంగా విస్తరిస్తోందా..?

బెంగళూరులోని ఇద్దరు చిన్నారులకు చైనా వైరస్ సోకిందని ఐసీఎంఆర్ ధ్రువీకరించింది. రొటీన్ సర్వీలియన్స్‌లో వారిద్దరిలో మల్టిపుల్ రెస్పిరేటరీ వైరల్ పాథోజెన్స్‌ను గుర్తించామంది. ఆ ఇద్దరు బాధితులకు అంతర్జాతీయ ప్రయాణాలు చేసిన చరిత్ర లేదని తేల్చిచెప్పింది. అయినప్పటికీ వ్యాధి రావడం అందరినీ కలవరపెడుతోంది. వీరిద్దరూ బెంగళూరులోని బాప్టిస్ట్ ఆస్పత్రిలోనే చికిత్స పొందడం గమనార్హం. స్థానికంగానూ ఈ వైరస్ విస్తరించిందా..? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

వ్యాప్తి ఇలా...

కరోనా మహమ్మారి మాదిరిగానే హెచ్‌ఎంటీవీ ఇన్ఫెక్షన్ లక్షణాలు వ్యాప్తి చెందుతున్నాయి. తుమ్ములు, దగ్గు వల్ల వెలువడే తుంపర్ల నుంచి వైరస్ ఇతరులకు సులభంగా వ్యాప్తి చెందుతుంది. వైరస్ ఉన్న వారితో సన్నిహితంగా మెలగడం, భౌతిక దూరం పాటించకపోవడం, మాస్క్ ధరించకపోవడం, తరచూ చేతులను శుభ్రంగా కడగకపోవడం వంటి కారణాల చేత ఈ వైరస్ ఇతరులకు వ్యాప్తి చెందే అవకాశం ఉంటుంది.

కోవిడ్-19 తరహా లక్షణాలే



కోవిడ్- 19 మహమ్మారి తరహాలో ఫ్లూ, ఇతర శ్వాసకోశ రుగ్మతలను హెచ్‌ఎంపీవీ వైరస్ లక్షణాలు పోలి ఉంటాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్ధారించింది. ఈ వైరస్ ఇన్ఫెక్షన్ సోకిన 3–6 రోజుల్లో లక్షణాలు బయటపడతాయి. జ్వరం, దగ్గు, ముక్కు కారడం, అలసట, రుచి, వాసన కోల్పోవడం వంటి లక్షణాలు సాధారణమైనవని వైద్యాధికారులు చెబుతున్నారు.

తక్కువ సాధారణ లక్షణాలు



తలనొప్పి, గొంతు నొప్పి, అతిసారం, చర్మంపై దద్దర్లు, నొప్పులు, చిరాకు కలిగి ఉండటాయి.

తీవ్రమైన లక్షణాలు

ఊపిరి ఆడకపోవడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, ప్రసంగం లేదా చలనశీలత కోల్పోవడం, ఛాతి నొప్పి తదితర సమస్యలు ఉత్పన్నమవుతాయి. వైరస్ తీవ్రత ఎక్కువగా ఉన్న వారిలో బ్రాంకైటీస్, నిమోనియాకు దారితీసే అవకాశం ఉంటుంది.

ఆందోళన వద్దు



హెచ్‌ఎంపీవీ వైరస్ పట్ల ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. మనదేశంలో దీని ప్రభావం తక్కువగా ఉంటుంది. ఈ వైరస్ పట్ల ఎలాంటి సంకేతాలు లేవు. ప్రజలు వ్యక్తిగత జాగ్రత్తలు తీసుకోవాలి. జలుబు, జ్వరం, దగ్గుతో పాటు శ్వాసకోశ సంబంధిత సమస్యలు ఎదురైనప్పుడు వెంటనే వైద్యుల్ని సంప్రదించాలి.

– డాక్టర్ బాలకృష్ణనాయక్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారు. తిరుపతి జిల్లా

అంత ప్రభావం ఉండకపోవచ్చు



కోవిడ్ 19 తరహాలో హెచ్‌ఎంపీవీ వైరస్ ప్రభావం ఉండకపోవచ్చు. అలా అని నిర్లక్ష్యం వహించొద్దు. కోవిడ్ తరహాలో తీసుకున్న జాగ్రత్తలను తీసుకోవాలి చైనా పరిస్థితులను పరిశీలిస్తే మూడు శాతం మందికి వైరస్ వచ్చే అవకాశం ఉంటుంది. ఆస్తమా, షుగర్ ఉన్న వాళ్లు జాగ్రత్తలు తీసుకోవాలి. వైరస్ ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నాం.

– డాక్టర్ రవిప్రభు, సూపరింటెండెంటు, రుయా, తిరుపతి

జాగ్రత్తగా ఉండాలి



అందరూ ఇప్పటి నుంచే జాగ్రత్తగా ఉండాలి. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి. చేతులు తరచూ సబ్బుతో శుభ్రం చేసుకోవాలి. హెచ్‌ఎంపీవీ వైరస్ చిన్నపిల్లలు, వృద్ధులు, రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్న వారిపై అధిక ప్రభావం చూపే అవకాశం ఉంది. వైరస్ సోకిన తర్వాత వారం రోజుల పాటు లక్షణాలు ఉండొచ్చు. వ్యాధికారక ఉనికిని ఆర్టీపీసీఆర్ ద్వారా నిర్ధారించొచ్చు. ఆస్తమా నుంచి న్యుమోనియా, అక్యూట్ రెస్పిరేటరీ డిస్ట్రెస్ సిండ్రోమ్ వరకు క్లినికల్ వ్యక్తీకరణలు ఉంటాయి.

– లోకేష్‌రెడ్డి, జనరల్ ఫిజీషియన్, అమర ఆస్పత్రి, రేణిగుంట

అప్రమత్తంగా ఉండాలి



హెచ్‌ఎంటీవీ వైరస్ వైరస్ పిల్లలకు సోకే అవకాశం ఉందని తెలుస్తోంది. రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్న పిల్లల పట్ల తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలి. జ్వరం, జలుబు, దగ్గు పట్ల నిర్లక్ష్యం వహించవద్దు. రోగ నిరోధక శక్తి పెంచే అన్ని ఆహారాలను పిల్లలకు అందించాలి. పాఠశాలలకు పిల్లల్ని పంపించేటప్పుడు మాస్కులు తప్పనిసరి

– డాక్టర్ వెంకటశ్వరరెడ్డి, చిన్నపిల్లల వైద్య నిపుణులు, సురక్ష కిడ్స్ ఆస్పత్రి, తిరుపతి


వారిపై తీవ్ర ప్రభావం



హ్యూమన్ మెటాప్ న్యూమోవైరస్ (హెచ్‌ఎంపీవీ)అనేది శ్వాసకోశ వ్యాధి. ఇది ఫ్లూ లేదా జలుబు వంటి లక్షణాలను కలిగి ఉంటుంది. ఈ వైరస్ అత్యంత తీవ్రమైనదిగా చైనా ప్రభుత్వం ప్రకటించింది. ఈ వైరస్ బారినపడితే బ్రోన్కైటిస్ లేదా న్యుమోనియా వంటి సమస్యలకు దారితీస్తుందని, ముఖ్యంగా వృద్ధులు, చిన్నపిల్లలు, రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్న వ్యక్తులపై తీవ్ర ప్రభావం చూపుతుందని ప్రపంచ ఆరోగ్య సంస్థ గుర్తించింది. ఇది చల్లని కాలంలో కేంద్రీకృతమై ఉండడంతో ప్రస్తుతం వైరస్ వ్యాప్తి చెందుతోంది. ఈ వైరస్ భారత్‌లోకి ప్రవేశించడంతో ముమ్ముందు ఏం జరుగుతుందోనన్న భయాందోళ రేకెత్తిస్తోంది.

అడ్డుకట్ట ఇలా..





హెచ్‌ఎంపీవీ వైరస్ వ్యాప్తిని అరికట్టాలంటే ప్రతి ఒక్కరూ వ్యక్తిగత జాగ్రత్తలు పాటించాల్సి ఉంటుంది. చేతులను తరచూ సబ్బుతో కనీసం 20 సెకండ్లు కడుక్కోవడం. చేతులను శుభ్రం చేసుకోకుండా నోరు, ముక్కు, కళ్లను తాకకుండా ఉండడం. బహిరంగ ప్రదేశాల్లో మాస్క్ ధరించడం. ఇతరులకు దూరంగా ఉండడం. వైరస్ బారినపడితే బయట తిరగకుండా హోమ్ క్వారంటైన్‌లో ఉండడం చేయాల్సి ఉంటుంది.

పారిశ్రామికవాడ.. ఏదీ రహదారుల జాడ

- అధ్వానంగా ఇండస్ట్రియల్ రోడ్లు
- పట్టించుకోని పరిశ్రమలశాఖ



అధ్వాన్నంగా గాజులమండ్యం ఎస్టేట్‌లోని రహదార్లు

శ్రీ కాళహస్తి రూరల్ (రేణిగుంట): నూతన కంపెనీలు, పరిశ్రమలను తీసుకురావడమేమో గానీ, పారిశ్రామికవాడలో ఉన్న పరిశ్రమలకు మౌలిక సదుపాయాలను కల్పించడంలో అధికారులు, పాలకులు విఫలమవుతున్నారు. రేణిగుంట మండలంలోని గాజులమండ్యం, రేణిగుంట ఇండస్ట్రియల్ ఎస్టేట్లలో మొత్తం 100కు పైగా వివిధ రకాల పరిశ్రమలున్నాయి. ప్రభుత్వానికి అధిక ఆదాయం సమకూరేలా ఎక్కువ పన్నులు చెల్లిస్తూ, వేలాది మందికి ఉపాధి కల్పిస్తున్న ఈ ఫ్యాక్టరీలకు మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. కానీ అటువంటి ఆలోచన ఏడు నెలలుగా కూటమి ప్రభుత్వం చేయకపోవడం విడ్డూరంగా ఉంది. రోడ్లు బురదగుంతల్లా మారి ఇబ్బందికరంగా తయారయ్యాయి. ఫ్యాక్టరీలకు వచ్చే భారీ వాహనాలు రాకపోకలు సాగించాలంటేనే వీలుకాని పరిస్థితులు నెలకొన్నాయి. రోడ్లలో పెద్దపెద్ద గుంతలు ఏర్పడి వాటిలో వర్షపునీరు చేరింది. కార్మికులు నిత్యం ఫ్యాక్టరీలకు వెళ్లి రావాలంటే ఆ గుంతల రోడ్లలే గతి. ఫ్యాక్టరీల నుంచి వచ్చే వ్యర్థపు నీరు వెళ్లేందుకు సరైన కాలవలు నిర్మించకపోవడం వల్ల ఆ నీరంతా రోడ్లపైకి చేరుతోంది. ఫ్యాక్టరీల నుంచి వచ్చే వ్యర్థపు నీరు ఫ్యాక్టరీల మధ్యలో ఉన్న ఖాళీ స్థలాలలో చేరి మురుగు గుంతలను తలపిస్తోంది. ఆ మురుగు గుంతలు దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారిపోతున్నాయి. వర్షం వచ్చిందంటే ఈ మురుగు నీరంతా రోడ్డుపైకి రావడంతో కర్మాగారాలకు వెళ్లే కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏపీఐఐసీ అధికారులు సమస్యల పైన దృష్టి పెట్టడం లేదని, కార్యాలయాలకే పరిమితం అవుతున్నారని విమర్శలున్నాయి. బయట రాష్ట్రాల నుంచి రహదారులను బాగుచేయాలని గళమెత్తలేని పరిస్థితుల్లో ఫ్యాక్టరీ యాజమాన్యాలున్నాయి. అధికారయంత్రాంగం స్పందించి ఇండస్ట్రియల్ ఎస్టేట్లలో మౌలికసదుపాయాలను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



తూకివాకం ఎస్టేట్‌లో రోడ్డు దుస్థితి



కాల్వలో రసాయన మురుగునీరు

పీఆర్ ఏఈ అలసత్వంపై ఆగ్రహం



ఏర్పేడు మండలం, అంజిమేడులో మినీ గోకులం షెడ్డు నిర్మాణాన్ని పరిశీలిస్తున్న జిల్లా డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్

రేణిగుంట(ఏర్పేడు): 'ఏర్పేడు మండలంలో రూ.1.70 కోట్లతో 35 సీసీ రోడ్డు పనులు మూడు నెలలకు ముందు మంజూరయ్యాయి. ఇప్పటి వరకు రూ.41 లక్షల విలువ గల 11 పనులు మాత్రమే చేశారు. ఇంకా 24 రోడ్డు నిర్మాణ పనులు మొదలుపెట్టకపోవడం ఏంటి?..' అంటూ మండల ఇంజినీరింగ్ అధికారి(పీఆర్ ఏఈ) రవితేజపై జిల్లా డ్వామా పీడీ సీవీ శ్రీనివాస ప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏర్పేడు మండలం, అంజిమేడులో జరుగుతున్న మినీ గోకులం పనులను ఆయన సోమవారం పరిశీలించారు. రెండు రోజుల్లో పెండింగ్ గోకులాలను పూర్తి చేయాలన్నారు. పంచాయతీలో జరుగుతున్న సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిమెంట్ రోడ్డు నిర్మించిన వారం రోజుల్లో మెటీరియల్ బిల్లులు పడిపోతున్నాయని, వెంటనే సిమెంట్ రోడ్డు నిర్మాణాలు పూర్తి చేయాలని ఆదేశించారు. పీఆర్ ఏఈ నిర్లక్ష్యం తగదని హెచ్చరించారు. ఏపీఓలు చంద్రశేఖర్ రాజు, అవిలాల దేవరి, మండల ఇంజినీర్ బీ.రవితేజ, టెక్నికల్ అసిస్టెంట్ శాలిమనోహర్, జూనియర్ ఇంజినీర్ పంజాడ బాలాజీరావ్ పాల్గొన్నారు.

సమస్యకు పరిష్కారం చూపండి

- ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 214 అర్జీలు

తిరుపతి అర్బన్: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే ప్రతి అర్జీకి పరిష్కారం చూపాలని కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ సిబ్బందిని ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో గ్రీవెన్స్ నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 214 అర్జీలు వచ్చాయి. అందులో 148 అర్జీలు రెవెన్యూ సమస్యలపైనే ఉన్నాయి. కలెక్టర్ మాట్లాడుతూ సమస్య పరిష్కారం కాకుంటే.. అర్జీదారులకు ఎందుకు సమస్య పరిష్కారం కావడం లేదు... అందుకు అవసరమైన డాక్యుమెంట్స్ ఏంటీ అనే వివరాలను రెవెన్యూ సమస్యలపై తెలియజేయాలన్నారు. జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్‌తోపాటు డీఆర్వో నరసింహులు, పలువురు జిల్లా అధికారులు ఇదే అంశాన్ని అర్జీదారులకు వివరించే ప్రయత్నం చేశారు.

నాకు న్యాయం చేయండి సార్

'నేను ఇప్పటి వరకు గడిచిన మూడు నెలల్లో ఆరు సార్లు కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్‌లో అర్జీలు ఇచ్చాను. నాకు న్యాయం చేయండి..' అంటూ తిరుపతిలోని వేదాంతపురానికి చెందిన డీ.చంద్రశేఖర్ మొరపెట్టుకున్నారు. ఏర్పేడు మండలంలోని వికృతమాల ప్రాజెక్టులో ఇంటి కోసం రూ.80వేలు చెల్లించామని, అయితే గృహనిర్మాణశాఖ అధికారులు తమకు వికృతిమాల అపార్ట్‌మెంట్‌లో ఇంటిని కేటాయించినట్లు చెబుతున్నారని చెప్పారు. కానీ ఇంటిని మాత్రం చూపించలేదని ఆవేదన చెందారు.



అర్జీలను పరిశీలిస్తున్న కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్



డీ.చంద్రశేఖర్

మా ఊరికి దారి లేదు

మా ఊరికి దారి చూపండి కలెక్టర్ గారు.. అంటూ పాకాల మండలంలోని మొగరాల రెవెన్యూ పరిధి, గెరికినెట్టు గ్రామానికి చెందిన వారు కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టారు. గానుగపెంట–మొగురాళ్ల రోడ్డును ఇటీవల మూత వేయడంతో ఆ మార్గంలోని గెరికిమెట్టు గ్రామానికి వెళ్లలేక తిప్పలు పడుతున్నట్టు వాపోయారు. ఈ మేరకు కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందించారు.



దారి చూపాలంటూ ధర్నా చేస్తున్న గెరికినెట్టు గ్రామస్తులు

క్లుప్తంగా

తల్లీకుమారుల అదృశ్యంపై కేసు నమోదు

నాయుడుపేట టౌన్: తల్లీకుమారుల అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు నాయుడుపేట ఎస్‌ఐ ఆదిలక్ష్మి తెలిపారు. ఆమె సోమవారం విలేకరులతో మాట్లాడుతూ నాయుడుపేట పట్టణంలోని పాగ్గొట్టం కాలనీకి చెందిన మహేశ్వర్ల శివప్రసాద్ భార్య పద్మ కుమారుడు (12)తో కలిసి సోమవారం ఉదయం బజారుకని చెప్పి ఇంటి నుంచి వెళ్లింది. ఎంత సేపటికీ తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పలుచోట్ల గాలించారు. ఆచూకీ లేకపోవడంతో రాత్రి పోలీసులకు ఫిర్యాదుచేశారు. ఆమె భర్త శివప్రసాద్ ఫిర్యాదు చేయడంతో కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ ఆదిలక్ష్మి తెలిపారు. తల్లీకుమారుల ఆచూకీ తెలిసిన వారు పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

బైక్ చోరీపై కేసు నమోదు

నాయుడుపేట పట్టణ పరిధిలోని మల్లాం జాతీయ రహదారి కూడలి సమీపంలో గత నెల 10వ తేదీన బైక్ చోరీకి గురైందని సూళ్లూరుపేట బాపూజీ కాలనీకి చెందిన దూదేకుల షబ్బీర్ సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అతను పల్సర్ బైక్‌ను 10వ తేదీన నాయుడుపేట మల్లాం జాతీయ రహదారి కూడలి వద్ద నిలిపి నెల్లూరు వెళ్లాడు. తిరిగి అదే రోజు రాత్రి వచ్చి చూడగా బైక్ కనిపించలేదు. పలుచోట్ల గాలించినా బైక్ కనిపించలేదు. దీంతో పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఆదిలక్ష్మి తెలిపారు.

ఇంటర్ విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ



మాట్లాడుతున్న విశ్వనాథ్‌నాయక్

తిరుపతి అర్బన్: ఇంటర్ విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని ఇంటర్మీడియెట్ జిల్లా అధికారి విశ్వనాథ్‌నాయక్ తెలిపారు. సోమవారం రాత్రి కలెక్టరేట్‌లో జిల్లాలోని 21 ప్రభుత్వ, ఒక ఎయిడెడ్ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ త్రైమాసిక, అర్ధవార్షిక పరీక్షల్లో 50 శాతం కన్నా తక్కువ మార్కులు వచ్చిన విద్యార్థులపై ప్రత్యేక ఫోకస్ పెట్టాలని ఆదేశించారు.

సర్వేజనా సుఖినోభవంతు

- వైఎస్సార్ సీపీ బాటలో కూటమి ప్రభుత్వం
- 20 నుంచి మళ్లీ రీ-సర్వే
- నాడు వద్దని రాద్ధాంతం
- ప్రజలు, రైతన్నలను తప్పుదోవ పట్టించిన వైనం
- అధికారంలోకి వచ్చాక సర్వే జపం..!



భూసర్వే చేస్తున్న అధికారులు(ఫైల్)

తిరుపతి అర్బన్: కూటమి ప్రభుత్వం మళ్లీ భూముల రీ-సర్వేకు శ్రీకారం చుట్టనుంది. ఈ నెల 20వ తేదీ నుంచి రీ సర్వే మొదలుపెట్టాలని ఇప్పటికే రెవెన్యూ శాఖ మంత్రి సత్యప్రసాద్ ఆదేశించారు. తొలుత ఒక్కో మండలంలో ఒక్కో గ్రామానికి ఎంపిక చేసుకుని పైలట్ ప్రాజెక్టుగా సర్వే చేయాలని భావిస్తున్నారు. తిరుపతి నగరం మినహాయిస్తే జిల్లాలో 33 మండలాలు ఉన్నాయి. ఈ 33 మండలాల్లో 33 గ్రామాల్లో తొలి దశగా సర్వే చేయనున్నట్టు తెలుస్తోంది. తర్వాత రెండో దశలో మొత్తం భూములు సర్వే చేస్తారా, లేదా? గత ప్రభుత్వం సర్వే చేసిన భూములను మినహాయించి...మిగిలిన భూముల్లో రీ-సర్వే చేస్తారా? అనే అంశాలపై ఇంకా స్పష్టత రాలేదు. అయితే గత ప్రభుత్వం భూముల రీసర్వేతోపాటు సరిహద్దు రాళ్లను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. నెల రోజులు కూటమి ప్రభుత్వం సరిహద్దు రాళ్లను తొలగించి, వాటిపై ఉన్న పేర్లను క్లియర్ చేసే పనిలో పడ్డారు.

గత సర్కార్‌లో భూముల రీ సర్వే ఇలా..

భూ సమస్యల పరిష్కారానికి గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నిబద్ధతతో కృషి చేసింది. భూముల రీసర్వేతో సమస్యలకు పూర్తి స్థాయిలో చెక్ పెట్టాలని గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సంకల్పించి, ఓ యజ్ఞంలా సర్వే చేయించారు. జిల్లాలో వందేళ్ల తర్వాత అంటే బ్రిటీష్ వారు సర్వే చేసిన తర్వాత 2020 వరకు ఏ నాయకుడూ దాని జోలికి వెళ్లలేదంటే అతిశయోక్తి కాదు. వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు- భూరక్ష పథకం పేరుతో సర్వేకు శ్రీకారం చుట్టారు. దేశంలోనే ఏ ముఖ్యమంత్రీ చేయని విధంగా కొన్ని ప్రాంతాల్లో సర్వే సైతం చేశారు. అయితే ఎన్నికలు సమీపిస్తుండడంతో లబ్ధి పొందాలనే దురుద్దేశంతో ప్రతిపక్షాలు ప్రజలు, రైతన్నలను పూర్తిగా తప్పుదోవ పట్టించాయి. సర్వే చేసి భూములు లాక్కొంటారంటూ పనిగట్టుకుని దుష్ప్రచారం చేశాయి. దీనికి ఎల్లో మీడియా భుజానికెత్తుకుని మోసింది. భూముల రీ-సర్వే విషయంలో ఎంతగా రాద్ధాంతం చేయాలో అంతగా చేసి, ప్రజలను తప్పుదోవ పట్టించడంతో సక్సెస్ అయ్యింది. అధికారంలోకి వచ్చాక కూటమి ప్రభుత్వం భూముల రీ సర్వే పాట అందుకుంది. గత ప్రభుత్వం ఏమైతే రీ సర్వేతో మంచి చేస్తామని ప్రకటించిందో అదే ఇప్పుడు పలుకుతూండటం గమనార్హం!

జిల్లాలో 1,051 గ్రామాల్లో భూముల సర్వేలు

నాలుగు దశల్లో జిల్లాలోని 1051 గ్రామాల్లోని 15,40,351 ఎకరాల్లో భూములు సర్వే చేయాలని గత ప్రభుత్వ హయాంలో నిర్ణయించారు. తొలి దశలో 74 గ్రామాల్లో 11,972 ఎకరాలు, రెండో దశలో 106 గ్రామాల్లో 27,998 ఎకరాలోల భూముల సర్వే పూర్తి చేశారు. పూర్తి చేసిన గ్రామాల్లో భూముల సరిహద్దు రాళ్లను ఏర్పాటు చేయడంతోపాటు 15,552 మందికి భూహక్కు పత్రాలు పంపిణీ చేశారు. మూడో విడతలో 140 గ్రామాల్లో 1,31,401 ఎకరాల్లో సర్వే దాదాపుగా పూర్తి చేశారు.. ఆ తర్వాత 4వ దశలో 13,68,980 ఎకరాల్లో భూ సర్వే చేయాలని ప్రణాళికలు సిద్ధం చేశారు.అయితే రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో ఏడు నెలలు సర్వేకు బ్రేక్ పడింది. తిరిగి ఈ నెల 20 నుంచి సర్వేకు పూనుకుంటున్నారు

జిల్లా సర్వే వివరాలు
మొత్తం సర్వే గ్రామాలు - **1,051**
సర్వేయర్ల సంఖ్య - **421**
సర్వే చేయాల్సిన భూములు **15,40,351** ఎకరాలు
సర్వే చేసిన భూములు **1,71,371** ఎకరాలు
తొలిదశలో సర్వే పూర్తి చేసిన గ్రామాలు -**74**
2వ దశలో సర్వే పూర్తి చేసిన గ్రామాలు - **106**
3వ దశలో సర్వే దాదాపుగా పూర్తి చేసిన గ్రామాలు- **140**
4వ దశలో సర్వేకి ఎంపిక చేసిన గ్రామాలు **731**

ముందుగా పైలట్ ప్రాజెక్టు సర్వే



ఈ నెల 20 నుంచి సర్వే చేయాలని నిర్ణయించాం. తొలుత 33 మండలాల్లో పైలట్ ప్రాజెక్టు కింద ఒక్కో గ్రామానికి ఎంపిక చేసి సర్వే చేస్తాం. తర్వాత మొత్తంగా సర్వే ఉంటుంది. గతంలో సర్వే చేసిన గ్రామాల్లో మళ్లీ సర్వే చేయడమంటూ ఉండదు. సర్వే చేయని గ్రామాల్లో మాత్రమే సర్వే చేస్తాం. గతంలో ఉపయోగించిన డ్రోన్లు అలానే వాడుకుంటాం. సర్వేయర్లు గతంలో ఉన్నవారే ఉంటారు.

-అరుణ్‌కుమార్, జిల్లా సర్వే విభాగం అధికారి

నేటి నుంచి బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ



సంతోషరావు, సీఎండీ, ఎస్పీడీసీఎల్

తిరుపతి రూరల్: ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఎస్పీడీసీఎల్) 2025-26 ఆర్థిక సంవత్సరానికి సమర్పించిన ఆర్థిక అవశ్యకత, విద్యుత్ ఛార్జీల ప్రతిపాదనలపై ఈనెల 7 నుంచి మూడు రోజుల పాటు ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్సీ) బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోష రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం, బుధవారం విజయవాడలోని ఎ కన్వెన్షన్ సెంటర్‌లోనూ, 10వ తేదీన కర్నూలులోని రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి కార్యాలయంలో ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ మూడు రోజుల్లో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నేరు గాను, తర్వాత మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4:30 గంటల వరకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వినియోగదారులు, తమ సూచనలు, అభ్యంతరాలను వెల్లడించవచ్చని తెలిపారు. ఏపీఈఆర్సీ చైర్మన్ ఠాకూర్ రామ్ సింగ్ ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమం ద్వారా వినియోగదారులు తమకు సమీపంలోని విద్యుత్ సర్కిల్ కార్యాలయాలు, డివిజనల్ కార్యాలయాలు నుంచి పాల్గొని, టారిఫ్ ప్రతిపాదనలపై సూచనలు, అభ్యంతరాలు, అభిప్రాయాలను తెలియజేయాలని ప్రకటనలో కోరారు.

పోలీస్ గ్రీవెన్స్‌కు 69 ఫిర్యాదులు



ఎస్పీ సుబ్బరాయుడుకు ఫిర్యాదులు అందజేస్తున్న బాధితులు

తిరుపతి క్రైం: తిరుపతి జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి జిల్లా నలు మూలల నుంచి మొత్తం 69 ఫిర్యాదులు అందినట్టు ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు.

తుక్కు సూత్రధారులను సస్పెండ్ చేయాలి

తిరుపతి సిటీ : ఎస్వీయూలో గత కొద్దిరోజులుగా అక్రమంగా తరలిస్తున్న స్క్రాప్‌పై సమగ్ర విచారణ జరిపించాలని, కుంభకోణానికి కారకులైన అధికారులను సస్పెండ్ చేయాలని ఏఐఎస్ఎఫ్ డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యదర్శి శివారెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందెల నాసర్‌జీ ఉన్నత విద్యా మండలి చైర్మన్ మధు మూర్తిని కలసి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ యూనివర్సిటీలో నిబంధనలు పాటించకుండా గుట్టుచప్పుడు కాకుండా స్క్రాప్‌ను కొందరు అధికారులు లారీల ద్వారా విక్రయించి సొమ్ము చేసుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సుమారు రూ.60 లక్షల విలువచేసే కుర్చీలు, ఐరన్ వస్తువులు, పేపర్స్, ప్లాస్టిక్ స్క్రాప్‌ను కేవలం రూ.8 లక్షలకు విక్రయించారని మండిపడ్డారు. బహిరంగ టెండర్స్ పిలవకుండా పేపర్ ప్రకటన లేకుండా విక్రయించడం వర్సిటీ ఆస్తిని కొల్లగొట్టడం దారుణమన్నారు. తక్షణమే ప్రస్తుతం విక్రయిస్తున్న పద్ధతిని రద్దుచేయాలని డిమాండ్ చేశారు. బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



ఉన్నత విద్యామండలి చైర్మన్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

ముగ్గురు సెక్యూరిటీ సూపర్‌వైజర్లపై వేటు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో జరుగుతున్న అవకతవకలపై దళారులను అడ్డుకోవడంలో విఫలమైన ముగ్గురు సెక్యూరిటీ సూపర్‌వైజర్లపై సోమవారం ఈఓ బాపిరెడ్డి వేటు వేశారు. ఈ ముగ్గురూ దళారీలకు సహకరిస్తున్నారన్న విమర్శల నేపథ్యంలో వారిపై వేటు పడినట్లు తెలిసింది. ఇందులో ఓ సెక్యూరిటీ సూపర్‌వైజర్ శివయ్య గోపురం సమీపంలోనే మద్యం, మాంసం సేవించినట్లు అప్పట్లో సోషల్ మీడియాల్లో వైరల్ అయింది. దీనిపై 'సాక్షి'లో కథనం కూడా వెలువడింది.

భక్తుల ఆరోగ్య భద్రతే లక్ష్యం



మాట్లాడుతున్న టీటీడీ అదనపు ఈఓ వెంకయ్య చౌదరి


తిరుమల: తిరుమలకు వచ్చే యాత్రికుల ఆరోగ్య భద్రతకు భరోసా కల్పించడం టీటీడీ ప్రథమ లక్ష్యమని, తిరుమలలోని హోటళ్ల యజమానులు నాణ్యతా ప్రమాణాలు పాటించాలని టీటీడీ అదనపు ఈఓ సీహెచ్ వెంకయ్యచౌదరి చెప్పారు. తిరుమలలోని ఆస్థాన మండపంలో సోమవారం హోటళ్ల యజమానులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. తిరుమలలోని అన్ని హోటళ్లు, తినుబండార కేంద్రాలు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు భక్తుల ఆరోగ్య భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. తినుబండారాల ఆవరణలో పరిశుభ్రత, పాటించాలని, నిబంధనలు, మార్గదర్శకాలను పాటిస్తూ తిరుమల ఖ్యాతిని నిలబెట్టాలని సూచించారు. అనంతరం దుకాణదారులందరికీ ఎస్‌ఓపీ జాబితాను సిద్ధం చేయాలని, చెక్‌లిస్ట్ ఇవ్వాలని, ఏవైనా కొరత ఉంటే వాటిని సరిదిద్దేందుకు కొంత సమయం ఇవ్వాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎస్టేట్స్ అధికారి వెంకటేశ్వరులు, డిప్యూటీ ఈఓ హెల్త్ ఆశాజ్యోతి, హెల్త్ ఆఫీసర్ మధుసూదన్, వీజీఓలు రామ్‌కుమార్, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

నగరంలో ఎక్సైజ్ శాఖ తనిఖీలు



తిరుపతి క్రైం : నగరంలోని మద్యం షాపులు, బార్లలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ సోమవారం తనిఖీలు చేపట్టింది. తిరుపతి సీఐ రామచంద్ర మాట్లాడుతూ.. నగరంలోని వైన్ షాపులు, బార్లలో శాంపిళ్లు సేకరించామన్నారు. వీటిని ల్యాబొరేటరీకి పంపించి, ఏదైనా నాణ్యతా లోపం గుర్తిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం రికార్డులను పరిశీలించామన్నారు. ప్రతి ఒక్కరు ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే మద్యం విక్రయించాలని తెలిపారు.


ఎర్రచందనం అక్రమ రవాణాపై ఉక్కుపాదం



రాపూరు రేంజ్ పరిధిలోని అటవీశాఖ సిబ్బందితో టాస్క్‌ఫోర్స్ బృందం

రాపూరు: ఎర్రచందనం అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతామని తిరుపతి టాస్క్‌ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్ స్పష్టం చేశారు. రాపూరు మండలం, పెంచలకోన అటవీశాఖ అతిథిగృహంలో రాపూరు రేంజ్ పరిధిలోని అటవీ సిబ్బందితో సోమవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తిరుపతి, నెల్లూరు, చిత్తూరు, కడప ప్రాంతాల్లో ఎర్రచందనం అక్రమ రవాణాను పూర్తి స్థాయిలో నిరోధించేందుకు ప్రభుత్వం టాస్క్‌ఫోర్స్ బృందాన్ని ఏర్పాటు చేసిందన్నారు. కార్యక్రమంలో టాస్క్‌ఫోర్స్ డీఎస్పీలు బాల్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, ఏసీఎఫ్ శ్రీనివాసులు, ఎఫ్ఆర్‌ఓ మురళీకృష్ణ, ఆర్‌ఐలు కృపానంద, సురేష్‌కుమార్‌రెడ్డి, ఆర్ఎస్ఐ వినోద్ కుమార్, రాపూరు రేంజర్ రవీంద్రబాబు, గోనపల్లి డీఆర్వో మస్తానయ్య, రేంజ్‌పరిధిలోని అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఎర్ర చందనం విక్రయాలకు అనుమతివ్వండి



టింబర్ డిపో సంఘం ప్రతినిధులతో మాట్లాడుతున్న అటవీ శాఖ అధికారులు

తిరుపతి మంగళం: రైతుల నుంచి కొనుగోలు చేస్తున్న ఎర్రచందనం దుంగలను విలువ ఆధారిత వస్తువులుగా తయారు చేసి, విక్రయించుకునేందుకు అనుమతులు ఇవ్వాలని టింబర్ డిపోల అసోసియేషన్ ప్రతినిధులు అటవీశాఖ అధికారులను కోరారు. తిరుపతి నగరంలోని అటవీ శాఖకు సంబంధించిన బయోట్రిమ్ కార్యాలయంలో సోమవారం తిరుపతి సర్కిల్ సీఎఫ్(కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్) సెల్వం, డీఎఫ్వో వివేక్, స్టేట్ సిల్వికల్చరిస్ట్ నరేందిరన్ ఆధ్వర్యంలో ఏపీ, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక పరిధిలోని టింబర్ డిపోల అసోసియేషన్ల ప్రతినిధులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. అసోసియేషన్ ప్రతినిధులు పలు డిమాండ్లను అధికారులకు విన్నవించారు. ఎర్రచందనం తోటలను పెంచుతున్న రైతుల వద్ద నుంచి కొనుగోలు చేసే దుంగలను అమ్ముకోవడం ఇబ్బందికరంగా మారిందన్నారు.


విస్తృతంగా పింఛన్ల తనిఖీ



తనిఖీలు చేస్తున్న వైద్యబృందాలు

తిరుపతి అర్బన్: గత సర్కార్ పక్షవాతంతో పాటు, కండరాల వ్యాధులతో బాధపడుతూ ఇంటికే పరిమితమైన 1,199 మంది రోగులకు నెలకు రూ.15 వేల చొప్పున పింఛన్ అందిస్తోంది. వారిలో చాలామంది అనర్హులు ఉన్నారని, నకిలీ సదరన్ సర్టిఫికెట్లతో పింఛన్లు పొందుతున్నారంటూ కూటమి ప్రభుత్వం తనిఖీలకు శ్రీకారం చుట్టింది. ఈ మేరకు జిల్లా వ్యాప్తంగా తనిఖీలను విస్తృతం చేసింది. సోమవారం జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో ఏడు వైద్య బృందాలు పింఛన్ లబ్ధిదారుల ఆరోగ్యాన్ని పరీక్షించడంతోపాటు వాటి సదరన్ సర్టికెట్లను తనిఖీలు చేశారు. తొలి రోజు 82 కుటుంబాలను వారి ఇంటికే వెళ్లి పరిశీలించారు. రోగులతో మాట్లాడి పూర్తి వివరాలను సేకరించారు. ఈ నెల 31వ తేదీకి ఈ తనిఖీలు పూర్తి చేయనున్నారు. ఆ తర్వాత ఫిబ్రవరి మొదటి వారం నుంచి ప్రతి నెలా రూ.6వేలు పింఛన్ తీసుకుంటున్న రోగులు, విభిన్న ప్రతిభావంతులను తనిఖీ చేయనున్నారు.

అవిలాల చెరువును అభివృద్ధి చేద్దాం



చర్చిస్తున్న కలెక్టర్ ఎస్. వెంకటేశ్వర్

తిరుపతి అర్బన్: నేషనల్ గ్రీన్ ట్రిబ్యూనల్ నిబంధనల మేరకు అవిలాల చెరువు అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ సిబ్బందిని ఆదేశించారు. సోమవారం ఆయన కలెక్టరేట్‌లో అవిలాల చెరువుపై సమీక్షించారు. పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా చెరువుకు పచ్చదనం, వాకింగ్ ట్రాక్, చెరువు కరకట్ట బలోపేతం తదితర అంశాలపై కలెక్టర్ వారికి వివరించారు. తుడా సెక్రటరీ వెంకట నారాయణ, ఎస్ఈ కృష్ణారెడ్డి, ఈఈ రవీంద్ర, ఉద్యానశాఖ అధికారి మాలతి, టీటీడీ ఈఈ మనోహర్, ఇరిగేషన్ ఈఈ ప్రసాద్, ఆర్కిటెక్ అధికారి రఘురామన్ పాల్గొన్నారు.

ఫోరెన్సిక్ నర్సింగ్ విద్యపై అవగాహన



కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభిస్తున్న రిజిస్ట్రార్, ప్రిన్సిపల్, వైద్యులు

తిరుపతి తుడా: స్విమ్స్ నర్సింగ్ కళాశాల ఆధ్వర్యంలో నిరంతర వైద్య విద్యా కార్యక్రమంలో భాగంగా ఫోరెన్సిక్ నర్సింగ్ విద్యపై విద్యార్థులకు సోమవారం అవగాహన కల్పించారు. పద్మావతి ఆడిటోరియంలో జరిగిన ఈ కార్యక్రమాన్ని స్విమ్స్ రిజిస్ట్రార్ బిట్లా, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సుధారాణి, వైద్యులు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరోగ్య సంరక్షణ, చట్టపరమైన మధ్య అనుసంధానంగా ఫోరెన్సిక్ నర్సింగ్ వ్యవహరిస్తుందన్నారు.

దామినేడులో దొంగలుపడ్డారు



ఇంటి ప్రధాన ద్వారాన్ని పగులగొట్టిన దుండగులు

చంద్రగిరి: దామినేడులోని ఓ ఇంట్లో ఎవరూ లేని సమయంలో దొంగలు పడిన ఘటన సోమవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. దామినేడుకు చెందిన వెంకటేశ్వరరావు వ్యాపార నిమిత్తం హైదరాబాద్‌లో ఉంటారు. తరచూ దామినేడులోని ఇంటికి వస్తూ వెళ్తుంటారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో సోమవారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు తలుపులు పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించారు. అనంతరం బెడ్‌రూంలోకి వెళ్లి కప్‌బోర్డులోని వస్తువులను చిందరవందరగా పడేసి వెళ్లారు. ఉదయం ఇంటికి వచ్చిన పనిమనిషి, దొంగలు పడినట్లు గుర్తించి యజమానికి సమాచారం అందించాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి, వేలిముద్రలను సేకరించారు. అయితే ఇంట్లో ఏదైనా విలువైన వస్తువులు పోయాయా అన్న విషయం తెలియరాలేదు. మంగళవారం ఇంటి యజమాని వెంకటేశ్వర రావు పోలీసులకు ఫిర్యాదు చేయనున్నారు.

క్రీడల్లోనూ రాణించాలి



జ్యోతి ప్రజ్వలనతో పోటీలను ప్రారంభిస్తున్న వీసీ, అధికారులు

తిరుపతి సిటీ: విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలంటే అకడమిక్ విద్యతో పాటు క్రీడారంగంలో రాణించాలని ఎస్వీ వెటర్నరీ వర్సిటీ వీసీ జేవీ రమణ పిలుపునిచ్చారు. సోమవారం వర్సిటీ వేదికగా ప్రారంభమైన 13వ వెటర్నరీ అంతర్‌కళాశాలల క్రీడాసాంస్కృతిక పోటీలను ఆయన వర్సిటీ అధికారులతో కలసి జ్యోతిప్రజ్వల చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసం, ఆరోగ్య సంరక్షణతో పాటు ఉన్నత విద్యకు, ఉపాధి, ఉద్యోగ అవకాశాలలో ప్రధాన భూమిక పోషిస్తాయన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వెటర్నరీ కళాశాల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పోటీలలో పాల్గొనడం సంతోషకరమన్నారు. తొలి రోజు వాలీబాల్, బాస్కెట్ బాల్, టెన్నీకాయిట్, బాల్ బ్యాడ్మింటన్ పోటీలలో ప్రొద్దుటూరు, తిరుపతి, గన్నవరం, గరివిడి కళాశాలలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. సాయంత్రం సాంస్కృతిక పోటీలు ఆకట్టుకున్నాయి. డీన్లు కే.వీ రబ్రహ్మయ్య, కే నాగేశ్వర్‌రావు, వెటర్నరీ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ జగపతిరామయ్య, పీడీ జయచంద్ర, డాక్టర్ రాంబాబు నాయక్, మురళీధర్, డాక్టర్ చైతన్య, ప్రవంతి పాల్గొన్నారు.